వైపై సమస్యను పరిష్కరించాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 8: టీయూలో కొన్ని నెలలుగా నెలకొన్న వైపై సమస్యను వెంటనే పరిష్కరించాలని వర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీనూనాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఆన్‌లైన్ తరగతులు వినలేక నష్టపోతున్నారని తెలిపారు. వైపైతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు అంశమై వీసీ, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందని లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ధర్పల్లి, డిసెంబర్ 8 : శ్రమజీవుల నాయకుడు ఎల్లన్న స్మారక సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రేకులపల్లి గ్రామంలో స్మారక సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లన్న బడుగు, బలహీన వర్గాల శ్రమజీవుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈనెల 16న సిరికొండ మండలం గడ్కోల్‌లో నిర్వహించనున్న స్మారక సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, లక్ష్మణ్, దాసు, భూమయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య అస్తిత్వానికి కార్యాచరణ

సభలో ప్రసంగిస్తున్న ఘనపురం దేవేందర్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 8 : తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభల సందర్భంగా తెలంగాణ అస్తిత్వ సాహిత్యం – వర్తమాన సందర్భం' అంశాన్ని ఎంచుకోవడం అభినందనీయమని, మేధావులంతా మేథోమథనం చేసి తెలంగాణ అస్తిత్వానికి కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరముందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డాక్టర్ నందిని సిదారెడ్డి, నిఖిలేశ్వర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, వేణుగోపాల్, కందుకూరు శ్రీరాములు, జి. నర్సింహా స్వామి, డాక్టర్ వి.శంకర్, ముత్తిగారి కవిత పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై అవగాహన ఉండాలి'

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు, సభ్యులు

రుద్రూర్, డిసెంబర్ 8 : పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా పోటీ చేసే అభ్యర్థులు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని పరిష్కరించాలని మండల కేంద్రంలోని అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాస్‌రావు అన్నారు. ఇందుకు సంబంధించి రూపొందించిన కరపత్రాలను మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యుడు మేక వెంకటేశ్వరరావు, కొప్పర్గ మాజీ సర్పంచ్ జమీల్ పటేల్, మాజీ సర్పంచ్ తోట శంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

బోర్గాంలో ఖాళీ బిందెలతో నిరసన

బోర్గాంలో ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

రెంజల్, డిసెంబర్ 8 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బోర్గాంలో గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నో కాలనీలో మూడు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ తాగునీటి కష్టాలు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. చలికాలంలో తాగునీటి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇతర వీధిలోకి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. తాగునీటి సమస్యను గత నెలలోగ్రామ కార్యదర్శి రాణి దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకుండా పోయిందన్నారు.

'ఎన్‌సీఎస్ఎఫ్‌ను బెల్లం కేంద్రంగా మార్చాలి'

సారంగాపూర్, డిసెంబర్ 8: రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీఎస్ఎఫ్‌ను తెరిపించి బెల్లం కేంద్రంగా మార్చాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఏడాది కాలంగా చెబుతూ వస్తున్నారని అన్నారు. ఆదివారం ఆయన రూరల్ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల తప్పుడు విధానాలు, అధికారుల అలసత్వంతో సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ మూత పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెప్పిందని, దీనిపై సబ్‌కమిటీని వేసిందన్నారు. చెరుకు పండించేందుకు రైతులు ముందుకు వస్తున్నారని, అయితే ప్రభుత్వం ముందుగా ఫ్యాక్టరీని తెరిపించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కృష్ణాగౌడ్, సాయిలు, రాజు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కంఠేశ్వర్, డిసెంబర్ 8 : నగరంలోని వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ –1 ఏడీఈ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్ 100 ఫీట్ రోడ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, కోటగల్లీ, గాయత్రీనగర్, చంద్రనగర్, న్యాల్‌కల్ రోడ్, శ్రీనగర్, పూలాంగ్, గోల్ హనుమాన్ ప్రాంతం, ఆకుల పాపయ్య రోడ్, గూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం

కంఠేశ్వర్, డిసెంబర్ 8 : జిల్లా తెలంగాణ వ్యాయామ విద్య, ఉపాధ్యాయ సంఘం (టీజీ పేట)సర్వసభ్య సమావేశం జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. సంఘం పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ నూతన కార్యవర్గాన్ని సభ్యుల సమక్షంలో ఏకగ్రీవ తీర్మానం ద్వారా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా బి.గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా బీఆర్.రాజేశ్వర్, ఉపాధ్యక్షురాలిగా మాన్యం పావని, సభ్యుడిగా సుశీల్‌ను ఎన్నుకొన్నారు.

నేటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు

సారంగాపూర్, డిసెంబర్ 8: మండలంలోని మల్లారం గ్రామ సమీపంలో ఉన్న శ్రీదత్త నిర్మల ఆశ్రమాలయంలో ఈనెల 9 నుంచి 16 వరకు దత్త జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆశ్రమాలయం చైర్మన్ సాంబయ్య శాస్త్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఉదయం విశేష అభిషేకం, 10 నుంచి 13 వరకు దత్త కోటి మహాయజ్ఞం, 14న పూర్ణాహుతి, 15న దత్త జయంతి వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16న గురుచరిత పారాయణంతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

ధర్పల్లికి 108 అంబులెన్స్ మంజూరు

ధర్పల్లి, డిసెంబర్ 8: మండల కేంద్రానికి 108 అంబులెన్స్ మంజూరైనట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సుశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా 108 అంబులెన్స్ అందుబాటులోకి రావడంతో మండలవాసులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రమాదాలు జరిగితే దీనిని సద్వినియోగం చేసుకోవచ్చని, రెండు మూడు రోజుల్లో సర్వీస్ అందుబాటులో వస్తుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

నవీపేట/డిచ్‌పల్లి, డిసెంబర్ 8: నవీపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మద్యం తాగి వాహనాలను (డ్రంక్ డ్రైవ్) నడుపుతున్న ముగ్గురిని పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మండల కేంద్రంలో ఎస్సై వినయ్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. వీరిలో పలువురి వాహనాలకు సరియైన ధ్రువపత్రాలు లేని కారణంగా వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే వాహనాలు నడుపుతున్న చిన్న పిల్లలపై చట్టరీత్యా చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలను నడిపితే జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నడిపే వాహనాలకు ధ్రువ పత్రాలతో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వాహనాల తనిఖీ చేస్తుండగా నలుగురు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడినట్లు సీఐ మల్లేశ్, ఎస్సై షరీఫ్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ విద్యార్థి ప్రాజెక్టు

సిరికొండ, డిసెంబర్ 8: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మానక్ వైజ్ఞానిక ప్రదర్శనలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థి ఎం సుశాంత్ (8వ తరగతి) రూపొందించిన సౌరశక్తి ఆధారిత ట్రాక్టర్ వ్యవసాయం (ఫార్మింగ్ విత్ సోలార్ ట్రాక్టర్) ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

బైకులు దొంగిలించిన నేరస్తుడి అరెస్టు

వినాయక్‌నగర్, డిసెంబర్ 8 : జల్సాలకు అలవాటు పడిన ఓ పాత నేరస్తుడు అడ్డదారుల్లో అక్రమంగా డబ్బు సంపాదించడమే వృత్తిగా పెట్టుకున్నాడు. గతంలో చోరీ చేసి జైలుకు వెళ్లి వచ్చిన నిందితుడు మళ్లీ దొంగతనానికి పాల్పడి పోలీసులకు చిక్కాడు. జిల్లా కేంద్రంలో బైకులను దొంగిలించిన నిందితున్ని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి వెల్లడించారు. నవీపేట్ మండలం బినోల గ్రామానికి చెందిన ఎరుకుల ప్రశాంత్ నిజామాబాద్ నగరంలోని పలు ఏరియాల్లో బైక్‌లను దొంగిలించాడు. కేసు నమోదు చేసిన పోలీసు అనుమానితుడైన ప్రశాంత్‌ను ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తాను మూడు బైక్‌లను దొంగిలించినట్లుగా నేరం అంగీకరించాడు. దొంగిలించిన మూడు బైక్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌హెచ్‌వో తెలియజేశారు.

108 అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

చందూర్‌లో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

పోతంగల్/ రుద్రూర్/ చందూర్, డిసెంబర్ 8 : ప్రజలు 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన పోతంగల్, రుద్రూర్, చందూర్ పీహెచ్ సీల వద్ద ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజు, స్థానిక నాయకులతో కలిసి 108 అంబులెన్స్ వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పోతంగల్, రుద్రూర్ మండల అధ్యక్షులు పుప్పాల శంకర్, తోట అరుణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, డాక్టర్ అలీముద్దీన్, నాయకులు గంధపు పవన్, గంట్ల విఠల్, నీరడి గంగాధర్, కొట్టం మనోహర్, బర్ల మధు, రాజు, ధనరాజ్, దత్తు, పత్తి లక్ష్మణ్, నడిపింటి నగేశ్, షేక్ ఖాదర్, మెడికల్ ఆఫీసర్ ఆయేషా సిద్దిఖా తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మండలంలోని ధర్మారం గ్రామంలో 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొన్నారు. 18 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

–డిచ్‌పల్లి, డిసెంబర్ 8

గొట్టుముక్కులలో ఉచితవైద్య శిబిరం

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాక్లూర్, డిసెంబర్ 8 : మండలంలోని గొట్టుముక్కుల జడ్పీహెచ్ఎస్‌లో రోటరీ క్లబ్ నిజామాబాద్, మల్లారెడ్డి, నారాయణ మల్టీ స్పెషాలిటీ దవాఖాన హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, మెగా ఆరోగ్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బీరెల్లి విజయరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన డాక్టర్ల బృందం ప్రజలకు చికిత్స చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమానికి ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీబీ కృష్ణమూర్తి గ్రామ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నేటి ఆధునిక జీవనంలో ప్రతి మనిషికి వైరస్‌ల కారణంగా వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వాటి నుంచి దూరంగా ఉండడానికి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు రామకృష్ణ, జుగల్ సోనీ, రాజేశ్వర్, నర్సింగరావు, రాజ్‌కుమార్ సుబేదార్, సతీశ్ షాహ, ఇనుగు రాజేశ్వర్, శ్రీరామ్ సోనీ, ధన్‌పాల్ శ్రీనివాస్ తదితరులతో పాటు మల్లారెడ్డి, నారాయణ దవాఖాన వైద్యులు డాక్టర్ అనిరుధ్, డాక్టర్ ముఖేశ్, డాక్టర్ రమ్య, డాక్టర్ ఆఫ్రిన్, హెచ్ఎం వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బోధన్ సీఎస్ఐ చర్చికి బిషప్ రాక

శక్కర్‌నగర్, డిసెంబర్ 8 : బోధన్ పట్టణంలోని సీఎస్ఐ చర్చికి బిషప్ ఇన్‌చార్జి, సీఎస్ఐ మెదక్ దయాసీ రెవరెండ్, డాక్టర్, ప్రొఫెసర్ కె. రూబెన్ మార్క్ సోమవారం వస్తున్నట్లు బోధన్ చర్చి పాస్టరేట్ స్టీవర్డ్ దమ్మల జ్యోతిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్చిలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ, శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఇద్దరి దారుణ హత్య

- వన్నెల్ (బి)లో భర్త చేతిలో భార్య
- జిల్లాకేంద్రంలో గుర్తుతెలియని దుండగుల చేతిలో మరొకరు

భర్త చేతిలో దారుణ హత్యకు గురైన శివకళ

మర్డర్‌కు గురైన యూసుఫ్

బాల్కొండ, డిసెంబర్ 8 : ఏడడుగులు తోడుంటానని మూడు ముళ్లు వేసిన ఓ కసాయి భర్త చేతిలో భార్య దారుణహత్యకు గురైన ఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని బిలోలి తాలుకా బీల్కోనికి చెందిన జంగ శివకళ (30) భర్త రాజుగంగారాం రెండేళ్ల కింద బతుకుదెరువు కోసం వన్నెల్(బి)లో వ్యవసాయ పనుల కోసం వచ్చి జీవిస్తున్నారు. అన్యోన్యంగా ఉన్న వారి కాపురంలో మద్యం చిచ్చు పెట్టింది. భర్త మద్యంకు బానిసై తచూ గొడవ పడేవాడు. అయితే భార్య శనివారం మద్యం మాన్పించేందుకు ఆయుర్వేద మందు తాగించేందుకు తీసుకెళ్లింది. రాత్రి ఇద్దరూ కలిసి భోజనం చేసి నిద్రించగా తెల్లవారే సరికి శివకళ హత్యకు గురైంది. భర్త రాజు గొడ్డలితో బాది బయట గడియపెట్టి పారిపోయాడు. ఉదయం యజమాని ఇంటికి వెళ్లి చూడగా రక్తపుమడుగులో విగతాజీవిగా పడి ఉంది. సమాచారం అందుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బాల్కొండ ఎస్సై నరేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ తరలించారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఆమె తల్లి పిరాజీ రాధాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

నగరంలో ఒకరు..

వినాయక్‌నగర్, డిసెంబర్ 8: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒకరు దారుణహత్యకు గురయ్యారు. మృతుడు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ యూసుఫ్‌గా గుర్తించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ యూసుఫ్(45) కొంత కాలం నుంచి నిజామాబాద్ నగరానికి వచ్చి ఇక్కడే ఉంటూ పాత సామాన్లు, చిత్తుకాగితాలు, ఏరుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్థానిక మిర్చికాంపౌండ్ ప్రాంతంలోని ఓ ట్రాన్స్‌పోర్టు ముందు నిద్రిస్తున్న యూసుఫ్ మెడభాగం నుంచి తీవ్ర రక్తస్రావమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై మొగులయ్య, సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా యూసుఫ్ మరణించి ఉన్నాడు. ఆధారాల కోసం డాగ్‌స్క్వాడ్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి ఇదే ప్రదేశంలో యూసుఫ్ పక్కన మరో ఇద్దరు వ్యక్తులు నిద్రించినట్లు గుర్తించిన పోలీసులు..వారిని అనుమానితులుగా భావించి అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో వారు కాదని తేలడంతో పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించి హంతకులు ఇతరులని నిర్ధారించారు. శనివారం రాత్రి యూసుఫ్‌తో కలిసి మరో ఇద్దరు మద్యం తాగుతున్న సమయంలో గొడవ చోటుచేసుకోగా.. సదరు వ్యక్తులు యూసుఫ్ గొంతుకోసినట్లు తెలిసింది. తీవ్ర రక్తస్రావం అవుతుండగా..యూసుఫ్ అలాగే నడుచుకుంటూ వచ్చి మిర్చికాంపౌండ్‌లో నిద్రించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. నిందితులు మిర్చికాంపౌండ్ ప్రాంతానికి చెందినవారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మోర్తాడ్, డిసెంబర్ 8: కమ్మర్‌పల్లిలో 20మందికి రూ.3.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం అందజేశారు. బషీరాబాద్‌లో ఎనిమిది మందికి, అమీర్‌నగర్‌లో ఆరుగరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్, సుధాకర్, సుభాష్, సుమన్, రఘు, అహ్మద్, మహేందర్, సంతరాజేశ్వర్, గంగారాం, పుప్పాల గంగాధర్, ప్రకాశ్, రాజేందర్, గణేష్, మహేష్, నర్సయ్య, రమేష్, శ్రీనివాస్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌కు క్రీడాకారుల ఎంపిక

మోర్తాడ్, డిసెంబర్ 8 : ప్రభుత్వ పాఠశాల మోర్తాడ్‌లో ఆదివారం సీఎం కప్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీఈటీ శ్యామ్ తెలిపారు. గ్రామస్థాయిలో ఎంపికైన విద్యార్థులను మండలస్థాయికి పంపించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి పోటీలకు సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు కేజీబీవీ విద్యార్థులు

డీఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న నందిపేట్ విద్యార్థులు

నందిపేట్, డిసెంబర్ 8 : జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్‌ఫేర్) శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి ఆదివారం మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో నందిపేట్ కేజీబీవీ విద్యాలయం మొదటి స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో జేసీ కిరణ్, డీఈవో అశోక్, జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి కిషన్ చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసా పత్రం, మెమోంటోను అందుకున్నారన్నారు. తమ పాఠశాల ఉపాధ్యాయినిలు సంధ్యారాణి, స్వరూప ను విద్యార్థులకు గైడ్‌గా పంపామని, వారి సహకారంతో విద్యార్థులు రసజ్ఞ, గంగోత్రి అద్భుతంగా వివరించారన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు..

నవీపేట,డిసెంబర్ 8: ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన నవీపేట లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులను డీఈవో అశోక్ అభినందించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఇందూప్రియ రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైందని పేర్కొన్నారు.

చిట్టీ వ్యాపారి అదృశ్యం

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 8: వ్యాపారాల్లో దివాలా తీయడం ఐపీ (ఇన్‌సాల్‌వెన్సీ పిటిషన్) పెట్టడం పరిపాటిగా మారిపోయింది. కొందరు నిజంగా వ్యాపారాల్లో నష్టపోయి చేసిన అప్పులను తీర్చలేక కోర్టులను ఆశ్రయిస్తుండగా, మరికొందరు అప్పులు తీర్చే స్థోమత ఉన్నా డబ్బుల ఎగవేతకు ఐపీలు పెడుతున్నారు. ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన చిట్టీ వ్యాపారి 15 రోజులుగా కనబడకుండా పోవడంతో చిట్టీ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. సదరు వ్యాపారి గ్రామంలో మిత్రులు, బంధువులు, పరిచయస్తుల నుంచి చిట్టీ వేయించాడు. కాగా, సభ్యులకు చిట్టీ డబ్బులు చెల్లించకపోగా ఊరి నుంచి కనబడకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

నవీపేటలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకురాలు సీతక్క

నవీపేట, డిసెంబర్ 8: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోకి తీసుకొని రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకురాలు సీతక్క డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సీఎం పదవి చేపట్టిన రేవంత్‌రెడ్డి సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిచో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యమునక్క, చిరంజీవి, మండల అధ్యక్షురాలు సాయమ్మ, నాయకులు మల్లమ్మ, గంగామణి, దేవికణి, సుగుణ, లత, ఆమని, పుష్ప, భోజమ్మ, లక్ష్మి, నర్సింహులు, సురేశ్, రవి పాల్గొన్నారు.

నవీపేట ఎమ్మార్పీఎస్ కమిటీ ఏర్పాటు..

మండలంలోని ధర్మాపూర్ మహిళా ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైందని జాతీయ ఎమ్మార్పీఎస్ నాయకుడు చిరంజీవి తెలిపారు. కమిటీ అధ్యక్షురాలిగా సాయమ్మ, ఉపాధ్యక్షురాలిగా మల్లమ్మ, ప్రధాన కార్యదర్శిగా గంగ